

తప్పని యూరియా కష్టాలు

జిల్లాలో యూరియా కొరత తీరడం లేదు. బస్తా ఎరువు కోసం రైతులు గంటల తరబడి క్యూలో వేచి ఉండాల్సి వస్తోంది.

- 9లో ▸



నల్లాలు సరే..

మిషన్ భగీరథ పథకంలో భాగంగా పైప్ లైన్లు వేసి నల్లాలు బిగించినా.. చాలా గ్రామాలకు ఇప్పటికీ చుక్క నీరు రాలేదు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.5 /21.0

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నిజాంసాగర్ 4 గేట్ల ఎత్తివేత



నిజాంసాగర్ : సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో శుక్రవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 15,296 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నాలుగు వరద గేట్లను ఎత్తి 21,988 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 1,404.82 అడుగుల(17.542 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

'ఇళ్లను త్వరగా నిర్మించుకునేలా ప్రోత్సహించాలి'



కామారెడ్డి రూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన చిన్నమల్లారెడ్డి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కమిటీ సభ్యులతో కలిసి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్లు నిర్మించుకుంటున్న వారితో మాట్లాడి ఏదైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్ (1800 599 5991)కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇందిరమ్మ పథకానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తోందని, ఇందుకోసం రెవెన్యూ అధికారులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ సుభాష్, ఏఈ రాము తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుల పరిశీలన



నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట శివారులోని పోచారం ప్రధాన కాలువకు చేపట్టిన మరమ్మతు పనులను శుక్రవారం ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పనులను జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ఆయన వెంట ఇరిగేషన్ ఏఈ అక్షయ్‌కుమార్ ఉన్నారు.

స్త్రీనిధి బోర్డు రాష్ట్ర కోశాధికారిగా స్రవంతి



బీబీపేట : స్త్రీనిధి రాష్ట్ర బోర్డు కోశాధికారిగా మండల సమాఖ్య అధ్యక్షురాలు సదాల స్రవంతి ఎన్నికయ్యారు. రాష్ట్ర స్త్రీనిధి బోర్డు డైరెక్టర్ల సమావేశంలో కోశాధికారిగా తనను ఎన్నుకున్నట్లు స్రవంతి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమెను జిల్లా సమాఖ్య సభ్యులు సన్మానించారు.

పాతాళ గంగమ్మ పైపైకి..

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, పారిన వరదలతో భూగర్భ జలాలు పైకి వచ్చాయి. జిల్లాలో సరాసరిన 7.32 మీటర్ల లోతులోనే నీరుంది. గతంలో ఎత్తిపోయిన బోర్లలోనూ నీటి ఊట వచ్చింది. దీంతో యాసంగిలోనూ సాగునీటికి ఢోకా ఉండకపోవచ్చన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది.

- భారీ వర్షాలతో రికార్డు స్థాయిలో పెరిగిన భూగర్భ జలాలు
- సరాసరిన 7.32 మీటర్ల లోతులో నీరు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో గతనెల చివరి వారంలో రికార్డు స్థాయిలో కురిసిన భారీ వర్షాలతో భూగర్భ జలమట్టం భారీగా పెరిగింది. జూలై 26 నాటికి భూగర్భ జలమట్టం 12.90 మీటర్లు కాగా.. ఆగస్టు 26 నాటికి 8.87 మీటర్లుగా ఉంది. ఆగస్టు చివరి వారంలో దంచికొట్టిన వర్షాలతో భూగర్భ జలమట్టం మరింత ఎగబాకి 7.32 మీటర్లకు చేరింది. జిల్లాలో ఏడాది సాధారణ వర్షపాతం 983 మి.మీ. కాగా ఇప్పటికే 1,074 మి.మీటర్ల వర్షం కురిసింది. నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలా ప్రాజెక్టులన్నీ పొంగి ప్రవహించాయి. గతంలో ఎన్నడూ లేనంత వరద తాకిడితో ప్రాజెక్టుల గేట్లన్నీ ఎత్తి నీటిని దిగువకు వదిలారు. జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు నిండాయి. మంజీర నదితో పాటు వాగులన్నీ ఇప్పటికీ పారుతూనే ఉన్నాయి. ఇంకా వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ పేర్కొంటోంది. దీంతో భూగర్భ జలమట్టం మరింత పెరిగే అవకాశం ఉంది.

కరువు ప్రాంతాల్లోనూ దంచికొట్టిన వాన..

ఈసారి జిల్లాలో కరువు ప్రాంతాలుగా పేర్కొనే చోటా భారీ వర్షాలు కురిశాయి. దోమకొండ, భిక్కనూరు, బీబీపేట, మాచారెడ్డి, పాల్వంచ, రామారెడ్డి తదితర మండలాల్లో ఆగస్టు మూడో వారం వరకు అరకొర వర్షాలే కురిశాయి. ఆయా ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరి వారంలో కురిసిన భారీ వర్షాలు రైతులకు ఊరటనిచ్చాయి. ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం కూడా పెరిగింది. ఎత్తిపోయిన బోర్లన్నీ పోస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఆరేళ్లలో నమోదైన వర్షపాతం (మి.మీటర్లలో) వివరాలు..

సంవత్సరం	సాధారణం	కురిసినది	తేడా
2020-21	964.1	1218	26.41
2021-22	1029.0	1280.8	24.43
2022-23	1029.0	1462.8	42.15
2023-24	1029.0	1114.6	8.31
2024-25	995.1	1208.4	21.4
2025-26	983.0	1074.0	---

రెండు పంటలకు ఢోకా లేనట్టే...

జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో చెరువులు, ప్రాజెక్టులన్నీ నిండడంతో పాటు భూగర్భ జలమట్టం భారీగా పెరిగిన నేపథ్యంలో రెండు పంటలకు ఢోకా ఉండదని అధికారులు అంటున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. గతంలో ఎన్నడూ లేనంతగా మూడు రోజుల్లో కురిసిన భారీ వర్షాలతో జిల్లా అతలాకుతలమైన విషయం తెలిసిందే. జలాశయాలన్నీ జలకళను సంతరించుకోవడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పంటలతో పాటు యాసంగికీ నీటి ఇబ్బందులు ఉండవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎర్రాపహాడ్‌లో 0.29 మీటర్ల లోతులోనే నీరు..

జిల్లాలోని కొన్నిచోట్ల భూగర్భ జలమట్టం మరింత పైకి ఎగబాకింది. తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో 0.29 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలుండడం గమనార్హం. సదాశివనగర్‌లో 0.80 మీటర్లు, భిక్కనూరులో 0.87 మీటర్లు, మద్నూర్ మండలం మేనూర్‌లో 1.19 మీటర్లు, నిజాంసాగర్ మండలం బూర్గుల్‌లో 1.46 మీటర్లు, మద్నూర్ మండల కేంద్రంలో 1.49 మీటర్లు, జుక్కల్ మండలంలోని సావర్‌గావ్‌లో 1.75 మీటర్లు, బాన్సువాడలో 2.10 మీటర్లు, లింగంపేట మండలం భవానీపేటలో 2.20 మీటర్లు, మాచారెడ్డిలో 2.70 మీటర్లు, బాన్సువాడ మండలం హన్మాజీపేటలో 2.80 మీటర్లు, సదాశివనగర్ మండలం పద్మాజివాడిలో 2.90 మీటర్లు, దోమకొండ మండలం అంబారీపేటలో 2.95 మీటర్ల లోతులోనే నీరున్నట్లు డిజిటల్ వాటర్ లెవల్ మీటర్లు స్పష్టం చేస్తున్నాయి.

కాంగ్రెస్ సభ వాయిదా

- వర్షాలే కారణమంటున్న నేతలు
- త్వరలోనే నిర్వహిస్తామని ప్రకటన

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 15న కామారెడ్డిలో జరగాల్సిన బీసీ బహిరంగ సభ వాయిదాపడింది. వర్షాల వల్లే సభను వాయిదా వేస్తున్నామని, సభ ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని కాంగ్రెస్ నేతలు తెలిపారు.

కామారెడ్డిలో నిర్వహించాల్సిన సభ కోసం ఇటీవల జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలతో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్‌తో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు. 2 లక్షల మందితో సభ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. జనసమీకరణ కోసం ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, నేతల ఆధ్వర్యంలో మండలాలవారీగా కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే నాలుగైదు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు సభను వాయిదా వేసినట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. కాగా సభ ఎప్పుడు జరిగినా భారీ ఎత్తున తరలిరావాలంటూ మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పిలుపునిచ్చారు. సభ వాయిదా వేయడంతో సభ ఏర్పాట్లు నిలిచిపోయాయి. ఎప్పుడు నిర్వహిస్తారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

స్వేచ్ఛను హరించొద్దు



కామారెడ్డి అర్బన్/బాన్సువాడ రూరల్/ఎల్లారెడ్డి రూరల్ : ప్రజల గొంతుకగా నిలుస్తున్న 'సాక్షి' దినపత్రికపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని పలువురు మేధావులు పేర్కొన్నారు. పాత్రికేయులపై అక్రమ కేసులు పెట్టడమంటే భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమేనన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డితోపాటు పలువురు జర్నలిస్టులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం ప్రతిపక్షంతోపాటు పత్రికలపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని సూచించారు.

కక్ష సాధింపు చర్య..



ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకలు పత్రికలే. విమర్శలను ప్రభుత్వాలు సరైన విధంగా తీసుకోవాలి. పత్రికల గొంతునొక్కడం సరికాదు. సాక్షి మీడియాపై ఏపీ సర్కారు వేధింపులు, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి.

– కొంగల వెంకటి, రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం

మంచి సంప్రదాయం కాదు..



బడుగు, బలహీన వర్గాలు, విద్యార్థులకు పత్రికలే గొంతుకలు. ఏదైనా ఉంటే ప్రజాస్వామ్యయుతంగా ఎదుర్కోవాలి. అంతేగాని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారన్న సాకుతో సాక్షి జర్నలిస్టులపై దాడులు చేయడం, కేసులు పెట్టడం మంచి సంప్రదాయం కాదు.

– ముదాం అరుణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు, ఎస్ఎఫ్ఐ

కేసులు ఉపసంహరించుకోవాలి



ప్రజలు, ప్రజాస్వామికవాదుల పక్షాన నిలబడే పత్రికలపై ప్రభుత్వాల దాడులు సర్వసాధారణమయ్యాయి. ప్రజల గొంతుకగా నిలబడుతున్న సాక్షిపై ఏపీ ప్రభుత్వం ఇలాగే కేసు పెట్టింది. ఆ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి.

– విజయరామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి, స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్

స్వేచ్ఛను హరించడం సరికాదు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న చర్య నిజాలను నిర్భయంగా రాసే వారికి సంకెళ్లు వేసినట్లుంది. ఇలా చేయడం ప్రజాస్వామ్యాన్ని కాలరాయడమే అవుతుంది. జర్నలిస్టుల స్వేచ్ఛను హరించడం సరికాదు. ప్రజాస్వామ్యాన్ని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలి.

– నాగం సాయిబాబా, న్యాయవాది, ఎల్లారెడ్డి

కేసులు ఎత్తివేయాలి



ప్రజాసమస్యలను ప్రభుత్వానికి వినిపించే పత్రికలపై అణచివేత ధోరణి సరికాదు. ప్రతిపక్ష పార్టీ చేసిన విమర్శలు అబద్ధమైతే అధికార పక్షం వాస్తవాలను చెప్పి ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలి. జర్నలిస్టులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రోద్బలంతో పోలీసులు పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలి.

– పి.లక్ష్మీనారాయణ మూర్తి, న్యాయవాది, బాన్సువాడ

ఖండించాల్సిన చర్య..



తప్పులను ఎత్తిచూపుతున్నారనే అక్కసుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపక్షం గొంతునొక్కాలని చూస్తోంది. ప్రభుత్వాన్ని విమర్శించిన వ్యక్తులపై కాకుండా.. దానిని ప్రచురించిన పత్రిక సంపాదకుడు, జర్నలిస్టులపై కేసులు పెట్టడం అన్యాయం. దీన్ని ప్రతి ఒక్కరు ఖండించాలి.

– అయ్యాల సంతోష్, ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బాన్సువాడ

బీసీలకు పెద్దపీట వేస్తున్నాం

- రిజర్వేషన్లను అమలు చేస్తాం
- కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాల్లో మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ రమేశ్‌రెడ్డి

మాచారెడ్డి : బీసీలకు పెద్దపీట వేస్తున్నామని పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క పేర్కొన్నారు. శుక్రవారం మాచారెడ్డి, పాల్వంచ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో ఆమె మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల అమలుకు చిత్తశుద్ధితో ఉన్నామన్నారు. రాష్ట్రం పంపిన బిల్లును కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటూ రాజకీయం చేస్తోందన్నారు. కామారెడ్డిలో ఈనెల 15న నిర్వహించాల్సిన బీసీ డిక్లరేషన్ సభను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. బీసీ డిక్లరేషన్ సభ ఎప్పుడు నిర్వహించినా వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కేసీఆర్ సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని అసత్యపు ప్రచారం చేయిస్తూ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారన్నారు. మహిళలకు రుణాలు ఇవ్వకపోగా, పావలా వడ్డీ ఎగ్గొట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. యూరియా అందించే బాధ్యత కేంద్రానిదని, తాము కూడా యూరియా కోసం ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. సోషల్ మీడియాల వేదికగా యూరియా కొరత సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యూరియా కొరత లేకుండా చేస్తాం

రైతులకు యూరియా కొరత లేకుండా చేస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. మాచారెడ్డి, ఎల్లంపేట గ్రామాలకు 40 మెట్రిక్ టన్నులు, సోమారంపేట, రత్నగిరిపల్లి గ్రామాలకు 30 మెట్రిక్ టన్నుల యూరియా తెప్పిస్తున్నామన్నారు. రెండు మూడు రోజుల్లో బీసీ డిక్లరేషన్ సభ తేదీని ప్రకటిస్తామన్నారు. కామారెడ్డి ప్రజలు ఇకముందైనా సరైన నిర్ణయం తీసుకుని సరైన నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. సమావేశాల్లో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీపీ నర్సింగరావు, మాచారెడ్డి, పాల్వంచ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నౌసీలాల్, రమేశ్‌గౌడ్, నాయకులు పూల్‌చంద్ నాయక్, సాయిలు, కమలాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, బ్రహ్మానందరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, గణేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'పీజీ కోర్సులకు ప్రతిపాదనలు పంపండి'



డెయిరీ ఉత్పత్తుల తయారీని పరిశీలిస్తున్న మంత్రి శ్రీహరి

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల అభివృద్ధి, పీజీ కోర్సుల కోసం ప్రతిపాదనలు పంపించాలని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. శుక్రవారం ఆయన రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ జి.అమిత్‌రెడ్డితో కలిసి కళాశాలను సందర్శించారు. డెయిరీ వివిధ విభాగాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కళాశాలకు ప్రహరీ నిర్మించడానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. పీజీ కోర్సు ప్రారంభిస్తే ఇక్కడి బీటెక్ విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని కళాశాల అసోసియేట్ డీన్ సురేశ్ రాథోడ్ వివరించారు. కళాశాల అధ్యాపకులు ఉమాపతి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

పాతరాజంపేట డెయిరీ సందర్శన

పాతరాజంపేటలోని విజయ డెయిరీని వాకిటి శ్రీహరి, గుత్తా అమిత్‌రెడ్డి సందర్శించారు. 45 ఏళ్లుగా సేవలందిస్తున్న డెయిరీని ఆధునికీకరించాల్సి ఉందన్నారు. పాతరాజంపేట డెయిరీ అభివృద్ధి విషయమై మంత్రి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వరరావు, జీఎం మధుసూదన్, అధికారులు కవిత, ధనరాజ్, లావణ్య, వైష్ణవి, పాల ఉత్పత్తిదారుల సంఘాల అధ్యక్షులు తిరుపతిరెడ్డి, కిష్టారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన ఉపాధ్యాయ నేత పుల్గం దామోదర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఇప్పటివరకు ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఉద్యోగ విరమణ చేయడంతో శుక్రవారం ఆయనను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

ఇసుక మేట.. తొలిగేదెలా?

- ఇటీవలి వరదలతో దెబ్బతిన్న వ్యవసాయ క్షేత్రాలు
- ఇసుక తొలగింపునకు ఉపాధి హామీ జాబ్‌కార్డ్‌తో లింక్
- అదీ ఒక రైతుకు 600 క్యూబిక్ మీటర్లకు మాత్రమే వర్తింపు
- ఆందోళనలో బాధిత రైతులు



బీబీపేటలో ఇసుక మేటల కొలతలు తీసుకుంటున్న అధికారులు

బీబీపేట : జిల్లావ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పోటెత్తాయి. భారీగా పంట నష్టం వాటిల్లింది. పొలాల్లో భారీ ఎత్తున ఇసుక మేటలు వేశాయి. ప్రాజెక్టులు, చెరువుల కట్టలు దెబ్బతినడంతో వ్యవసాయ క్షేత్రాల్లో రాళ్లు, రప్పలు వచ్చి చేరాయి. ఒకవైపు పంట కొట్టుకుపోయి ఏర్పడిన నష్టం.. మరోవైపు ఇసుక మేటలతో దెబ్బతిన్న వ్యవసాయ క్షేత్రం.. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న అన్నదాతలకు సర్కారు నుంచి సైతం ఊరట లభించడం లేదు.

జాబ్ కార్డు ఉంటేనే..

పొలాల్లో ఏర్పడిన ఇసుక మేటలను ఉపాధి హామీ పథకంలో తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే దీనికి పలు నిబంధనలు విధిస్తున్నారు. బాధిత రైతుకు ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డ్ ఉండాలంటున్నారు. ఒక్కో రైతుకు రెండెకరాలలోపు విస్తీర్ణంలో ఏర్పడిన మేటలను మాత్రమే తొలగిస్తామంటున్నారు. అదీ గరిష్టంగా 600 క్యూబిక్ మీటర్ల ఇసుక తొలగిస్తామని పేర్కొంటున్నారు. ఈ నిబంధనలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జాబ్‌కార్డ్ లేని, రెండుకరాలపైన భూమి ఉన్న రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. 600 క్యూబిక్ మీటర్ల నిబంధననూ తప్పుపడుతున్నారు. అర ఎకరంలోనే 600 క్యూబిక్ మీటర్లకు మించి ఇసుక పేరుకుపోయిందని పేర్కొంటున్నారు.

జిల్లాలో 586 ఎకరాల్లో ఇసుకమేటలు..

ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలో 586 ఎకరాల 23 గుంటల విస్తీర్ణంలో ఇసుక మేటలు ఏర్పడ్డాయని అధికారులు గుర్తించారు. ఒక్క బీబీపేట మండలంలోనే 97 ఎకరాల్లో ఇసుకమేటలు వేశాయి. ఇందులో 40 మందికి జాబ్‌కార్డు ఉండగా పది మందికి జాబ్‌కార్డులు లేవు. కొందరి భూమిలో రెండెకరాలకన్నా ఎక్కువ విస్తీర్ణంలో ఇసుక మేటలు వేయడంతో వారికి ఉపాధి హామీ పథకం వర్తించదు. ఈ నిబంధనలను రైతులు తప్పుపడుతున్నారు. ఎన్ని ఎకరాల్లో ఇసుకమేటలు ఉన్నా ప్రభుత్వమే తొలగించాలని కోరుతున్నారు.

నిబంధనల ప్రకారమే..

పంట పొలాల్లో ఇసుకమేటలు ఉన్నట్లయితే ఉపాధి హామీ పథకం ద్వారా తొలగింపజేస్తాం. దీనికి ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్నవారు అర్హులు. జాబ్‌కార్డు లేనివారికి జాబ్ కార్డు అందించడానికి చర్యలు తీసుకుంటాం. నిబంధనల ప్రకారమే ఇసుక మేటలు తొలగిస్తాం.

– సురేందర్, డీఆర్డీవో, కామారెడ్డి

విద్యార్థి ప్రతిభకు ప్రోత్సాహం

- 'ఎన్ఎంఎంఎస్'తో ఉపకారవేతనాల అందజేత
- పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం 2008 నుంచి ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్) పేరుతో స్కాలర్ షిప్‌లను అందజేస్తుంది. దీని కోసం ఆయా ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. పరీక్ష విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. ఎనిమిదో తరగతి తర్వాత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా విద్యార్థులు మధ్యలో చదువు మానేయకుండా ఇంటర్ వరకు కొనసాగించేలా స్కాలర్ షిప్‌లను అందిస్తోంది. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం అయింది.

- **అర్హతలు:** ఏడో తరగతిలో కనీసం 55శాతం మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఎనిమిదవ తరగతి చదివేవారు. ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు సాధించాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3–5 లక్షల లోపు ఉండాలి.
- **కావాల్సిన పత్రాలు:** ఆధార్ కార్డు, స్టడీ, కులం, ఆదాయం సర్టిఫికెట్లు
- **పరీక్ష ఫీజు:** ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల విద్యార్థులకు రూ. 50 దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబర్ 6
- **పరీక్ష తేదీ:** నవంబర్ 23న (డివిజన్ కేంద్రాల్లో)

ఎంపికైన వారికి..

ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచి ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ పొందవచ్చు. తొమ్మిదవ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉపకారవేతనం పొందవచ్చు. పదో తరగతి తర్వాత ఈ ఉపకార వేతనం కొనసాగాలంటే 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందాల్సి ఉంటుంది.

పరీక్ష విధానం..

ఈ పరీక్షను 180 మార్కులకు నిర్వహిస్తుండగా 180 ప్రశ్నలు ఉంటాయి. రెండు విభాగాలు ఉండగా మొదటి విభాగంలో మానసిక సామర్థ్యానికి సంబంధించి 90 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో రీజినింగ్, అర్థమెటిక్ సామర్థ్యం, పదాల భిన్న పరీక్ష, అంకెలు, అక్షరాల ఎనాలజీ, కోడింగ్–డీకోడింగ్, లాజికల్ ప్రశ్నలు, వెన్ చిత్రాలు, అద్దం, నీటి ప్రతిబింబాలకు సంబంధించిన ప్రశ్నలుంటాయి. రెండో విభాగంలో 7, 8వ తరగతుల సిలబస్ నుంచి 90 ప్రశ్నలుంటాయి. వీటిలో గణితం 20 మార్కులు, భౌతిక, రసాయన, జీవశాస్త్రాల నుంచి 35 మార్కులు, సాంఘీక శాస్త్రం నుంచి 35 మార్కుల చొప్పున ఉంటాయి. పరీక్ష తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బహుళైచ్ఛిక రూపంలో ఉంటాయి. పరీక్షకు ఇంకా సమయం ఉన్నందున ప్రణాళిక బద్ధంగా సన్నద్ధం అయితే పరీక్షలో ప్రతిభ చూపి, ఉపకారవేతనం పొందే అవకాశం ఉంటుంది.

క్లుప్తంగా

పంట పొలాల్లో ఇసుక మేటల తొలగింపు



లింగంపేట(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో ఏర్పడిన ఇసుక మేటలను శుక్రవారం ఉపాధి హామీ కూలీలతో తొలగిస్తున్నట్లు డీఆర్డీవో సురేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బూరుగిద్ద ఊర చెరువు కట్ట తెగిపోవడంతో ఇసుక మేటలు ఏర్పడ్డాయన్నారు. ఉపాధి హామి కూలీలతో ఇసుక మేటలు తొగించాలని కలెక్టర్ ఆదేశించడడంతో కూలీలను ఏర్పాటు చేసి ఇసుక మేటలను తొలగిస్తున్నామన్నారు. ఇసుక మేటలు తొలగించి తిరిగి పంటలు సాగయ్యేలా చేస్తామన్నారు. ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, ఏపీవో నరేందర్, తదితరులున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

బాన్సువాడ రూరల్/ఎల్లారెడ్డిరూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే దోస్త్‌కు ఆశించిన స్పందన రాకపోవడంతో స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నారు. బాన్సువాడలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల, ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు డాక్టర్ గంగాధర్, లక్ష్మీనారాయణ వేర్వేరుగా తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని వారు కోరారు. ఈ ఏడాది మాత్రమే కల్పించిన స్పాట్ అడ్మిషన్ల విధానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



రామారెడ్డి: ప్రజల్లోకి ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు తీసుకెళ్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రామారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన ప్రవీణ్ గౌడ్ అన్నారు. శుక్రవారం రామారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ప్రవీణ్‌గౌడ్‌ను నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. తనకు మండల అధ్యక్ష పదవి రావడానికి కారణమైన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు ప్రవీణ్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

'విజ్ఞాన ప్రదర్శనలతో కొత్త ఆవిష్కరణలు'



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు



విద్యార్థి ప్రదర్శనలను తిలకిస్తూ..

కామారెడ్డి అర్బన్: విద్యార్థులు తరగతిలో నేర్చుకున్న అంశాలతో పాటు తమ సొంత ఆలోచనలను ఆవిష్కరింపజేయడానికి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతో తోడ్పడుతాయని విశ్రాంత ఆచార్యులు, శ్రీసరస్వతి విద్యాపీఠం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్‌వీకే విశ్వేశ్వరరావు అన్నారు. కామారెడ్డి శ్రీసరస్వతి విద్యామందిర్ హైస్కూల్‌లో శుక్రవారం 3 రోజులపాటు రాష్ట్రస్థాయి గణిత విజ్ఞాన, సాంస్కృతిక మహోత్సవం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాస్త్రవేత్త, బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డితో పాటు ముఖ్యవక్తగా విశ్రాంత ఆచార్యులు విశ్వేశ్వరరావు హాజరై మాట్లాడారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. శిశుమందిర్ పాఠశాలల్లో ఆధ్యాత్మిక భావనతో పాటు శాస్త్రీయ దృక్పథం, దేశభక్తి అంశాలతో ఉత్తమ పౌరులుగా తీర్చదిద్దుతారన్నారు. నలంద, తక్షశిల లాంటి ప్రపంచంలోనే ఉత్తమ విశ్వ విద్యాలయాలు ప్రాచీన భారతదేశంలో ఉండేవని, చరిత్రకు ఎక్కని ఎందరో శాస్త్రవేత్తలు ఉన్నారన్నారు. ప్రపంచానికి జ్ఞాన భిక్ష పెట్టింది భారతదేశమన్నారు. విద్యార్థులు వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన విద్యార్థి దశలో అన్నీ ప్రశ్నలే వేసేవారని, వాటి ద్వారా అనేక జ్ఞానాన్ని సంపాదించి ప్రపంచ ఆధ్యాత్మిక, తత్వవేత్తగా నిలబడ్డారన్నారు. ఉన్నత స్థాయికి ఎదగడానికి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడుతాయని శాస్త్రవేత్త, బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి అన్నారు. శ్రీసరస్వతి విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్యాంసుందర్‌రావు, ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు బి.శంకర్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు. పలు జిల్లాలకు చెందిన 303 మంది విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనలో ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

విమోచన దినోత్సవం రోజున సేవా కార్యక్రమాలు



బాన్సువాడలో మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోనాల గంగారెడ్డి

బాన్సువాడ: తెలంగాణ విమోచన దినోత్సవం రోజు(సెప్టెంబర్ 17)ను పురస్కరించుకుని బాన్సువాడలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోనాల గంగారెడ్డి తెలిపారు. శుక్రవారం బాన్సువాడ బీజేపీ కార్యాలయంలో ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 17న తెలంగాణ విమోచన దినోత్సవంతో పాటు దేశ ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినం పురస్కరించుకుని పలు సేవ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అయ్యప్ప ఆలయంలో మోదీ పేరుపై అర్చన, ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 18న స్వచ్ఛ భారత్ పేరిట బాన్సువాడ ఆర్టీసీ బస్టాండ్‌లో పరిశుభ్రత కార్యక్రమం ఉంటుందని అన్నారు. కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, శంకర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, మజ్జిగ శ్రీనివాస్, చిరంజీవి, శంకర్, మహేష్, అనీల్, సాయిబాబా, కొండని తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

కృష్ణాష్టమి వేడుకలకు ముస్తాబు



దోమకొండ: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం జరిగే కృష్ణాష్టమి వేడుకలను ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదానం ఉంటుందని ఆలయ నిర్వాహకులు సందెల అబ్బయ్య తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాలాజీ జెండాకు భక్తుల పూజలు



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో కొలువుదీరిన బాలాజీ జెండాకు భక్తులు ప్రతి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఏడుకొండల వాడ వెంకట రమణ గోవిందా అంటూ భక్తులు భజనలు, ప్రత్యేక పూజలు చేయడంతో జెండా ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ నెల 17న శ్రీవారి బాలాజీ జెండా తిరుపతికి బయలుదేరుతుందని జెండా ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

శబరిమాత ఆశ్రమంలో పల్లకీ సేవ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శబరి మాత దివ్య సమాధి, ప్రతిమ, చిత్రపటాన్ని రకరకాల పూలతో అందంగా అలంకరించి పూజలు జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు.

ఎంవైఎఫ్ మండల అధ్యక్షుడిగా బాగయ్య

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండల మదన్ మోహన్ యూత్ ఫోర్స్(ఎంవైఎఫ్) అధ్యక్షుడిగా బాగయ్యను నియమించినట్లు ఎంవైఎఫ్ యూత్ నాయకులు శుక్రవారం తెలిపారు. ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడిగా బాగయ్యకు నియామక పత్రాన్ని కాంగ్రెస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, సాయిబాబాలు అందించారు. కాంగ్రెస్, ఎంవైఎఫ్ నాయకులు గురుప్రతాప్, వాసవి ఉన్నారు.

నాయబ్ తహసీల్దార్లకు పదోన్నతి

నిజామాబాద్అర్బన్: పలువురు నాయబ్ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి లభించింది. పదోన్నతికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర రెవెన్యూ శాఖ శుక్రవారం జారీ చేసింది. కామారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న నేనావత్ రాక, నిర్మల్ జిల్లాలో పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి తహసీల్దార్లుగా పదోన్నతి పొంది జిల్లాకు రానున్నారు. కాగా ఇదే జిల్లాలో పనిచేస్తున్న నరేష్ నాయబ్ తహసీల్దార్ నుంచి తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. వీరికి త్వరలోనే మండలాలు కేటాయించనున్నారు.

వివాహితతో అసభ్య ప్రవర్తన.. నిందితుడికి మూడేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్: వివాహితతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తి నిజామాబాద్ నాల్గవ అడిషనల్ మహిళ న్యాయస్థానం మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 10వేల జరిమానా విధించింది. వివరాలు ఇలా.. రెంజల్ మండల కేంద్రానికి చెందిన గైని కిరణ్ 2023 ఏప్రిల్ 14న తన పక్కింట్లో నివసించే వివాహిత ఒంటరిగా ఉండగా ఆమె ఇంట్లోకి ప్రవేశించి, అసభ్యకరంగా ప్రవర్తించాడు. వెంటనే ఆమె కేకలు వేయడంతో భర్త అక్కడికి చేరుకుని కిరణ్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించగా, ఫరారయ్యాడు. దీనిపై దత్తు తన భార్యతో కలిసి రెంజల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని జిల్లా కోర్టులో హాజరుపర్చారు. జడ్జి సాక్ష్యాలను విచారించిన అనంతరం నిందితుడు గైని కిరణ్‌కు మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు. అలాగే జిల్లా న్యాయసేవ సంస్థ బాధితురాలికి రూ.50వేల పరిహారం చెల్లించాలని జడ్జి తన తీర్పులో సూచించారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



రాజంపేటలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం



లింంపల్లికలాన్‌లో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆస్మా అఫ్రీన్ అన్నారు. శుక్రవారం కుప్రియాల్, ధర్మారావ్‌పేట్, భూంపల్లి, లింగంపల్లి తదితర గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. సీహెచ్‌వో నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేట, తలమడ్ల గ్రామాల్లో రాజంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించినట్లు వైద్యాధికారి విజయ మహాలక్ష్మి తెలిపారు. పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీవో రఘురాం, డాక్టర్ సంగీత, సూపర్వైజర్ మహమ్మద్ మంజూర్, గంగామణి, జీపీ సెక్రెటరీ అశోక్ కుమార్, వైఆర్‌జీకేర్ సుధాకర్, క్లస్టర్ లింక్ వర్కర్ శ్వేత, లావణ్య పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాటూర్, లింగంపల్లికలాన్, ఎర్రకుంటతండాలలో శుక్రవారం వైద్యశిబిరాలను నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులను అందజేశారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యదర్శులు రవీందర్, వనజ, అనిత, హెల్త్ సూపర్‌వైజర్ మణెమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు సుజాత, అపర్ణ, అజయ్, ఏఎన్ఎంలు మంగ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలోని మావులీ హోల్‌సెల్ బేకరి, కిరాణ దుకాణం శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. టీచర్స్ కాలనీలోని కోండవార్ రాకేష్ హోల్‌సెల్ బేకరి, కిరాణ దుకాణం నడపుతున్నాడు. శుక్రవారం ఆయన వేరే ఊరికి వెళ్లగా అతడి భార్య ఉజ్వల దుకాణంలో ఉంది. దుకాణం వెనకభాగంలోంచి ఒక్కసారిగా దట్టమైన మంటలు, పొగ వ్యాపించడంతో భయంతో ఆమె బయటకు పరుగులు తీసింది. స్థానికులు వెంటనే మద్నూర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దుకాణం మొత్తం మంటలు వ్యాపించి వస్తువులు మొత్తం కాలిబుడిదయ్యాయని బాధితులు తెలిపారు. దుకాణం మొదటి అంతస్తులో కిరాయికి ఉన్న వారు మంటలను చూసి పక్కన ఉన్న మరో ఇంటిలోంచి బయటకు వచ్చేశారు. ఫైర్‌సిబ్బంది రంగంలోకి దిగి మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. మద్నూర్ ఎస్సై విజయ్‌కొండ, పోలీసు, ఫైర్ సిబ్బంది స్థానికుల సహాయంతో దుకాణం పక్కనే ఉన్న మరో గోడౌన్‌లోని సామాన్లు బయటకు పడేయడంతో ఆస్తినష్టం తగ్గిందని వారు తెలిపారు. మంటలను అదుపులోకి తీసుకున్న తర్వాత దుకాణం లోపల స్టీల్ డబ్బాలో దాచిన ఉన్న 15 తులాల బంగారం, రూ.3 లక్షల నగదును లీడింగ్ ఫైర్‌మెన్ నరసింహులు బాధితులకు అప్పగించారు. ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఫైర్ సిబ్బంది హరీష్, రాణాప్రతాప్, రాజు, దిగంబర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

క్రైం కార్నర్

దుబాయ్‌లో మోపాల్‌వాసి మృతి



తలారి సవీన్(ఫైల్)

మోపాల్: మండలకేంద్రానికి చెందిన తలారి సవీన్ (35) దుబాయ్‌లో మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. సవీన్ ఆగస్టు 16న ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. 21న కంపెనీలో పని ముగించుకుని గదిలోకి వచ్చిన సవీన్.. ఫోన్, పర్సు, గుర్తింపు కార్డులు పెట్టి వెళ్లిపోయాడు. ఈనెల 26న రోడ్డు పక్కన చెట్టు కింద విగతజీవిగా పడి ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని వివరాల కోసం ప్రయత్నించారు. తెలియకపోవడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాగా గల్ఫ్ సంఘాలు, గ్రామస్తులు సవీన్ తప్పిపోయాడని వీడియో రూపొందించి వైరల్ చేశారు. ఆ వీడియోను పరిశీలించిన పోలీసులు.. వివరాలు సేకరించి కంపెనీకి సమాచారమిచ్చారు. సవీన్ మృతి వార్త తెలుసుకున్న కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి గల్ఫ్ సంఘం ప్రతినిధులతో మాట్లాడారు. త్వరగా మృతదేహాన్ని రప్పించే ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. మృతుడి తండ్రి తలారి చిన్న లక్ష్మణ్ సైతం దుబాయ్‌లో ఉన్నాడు. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని భార్య కృష్ణవేణి కోరుతున్నారు.

వాకింగ్ చేస్తున్న యువకులను ఢీకొన్న లారీ

- ఇద్దరికి గాయాలు



గాయపడిన శివ కుమార్

కామారెడ్డి క్రైం: వాకింగ్ చేస్తున్న యువకులను ఓ లారీ అదుపుతప్పి, ఢీకొన్న ఘటన కామారెడ్డి మండలం రామేశ్వర్‌పల్లి సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసు కుంది. వివరాలు ఇలా.. శాబ్దిపూర్ రైట్ తండాకు చెందిన శివ కుమార్, రామేశ్వర్‌పల్లి తండాకు చెందిన బదావత్ సంజీవ్ కలిసి శుక్రవారం ఉదయం వాకింగ్ పూర్తిచేసుకుని తిరిగి తమ ఇళ్లకు బయలుదేరారు. రామేశ్వర్‌పల్లి సమీపంలోని జాతీయ రహదారిపై వారిని ఓ గుర్తు తెలియని లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంజీవ్‌కు స్వల్ప గాయాలు కాగా శివ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తర లించారు. మెరుగైన చికిత్స కోసం శివ కుమార్‌ను హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన కారు

బోధన్‌రూరల్: సాలూర మండలకేంద్రంలోని శివారులో శుక్రవారం ఓ కారు అతివేగం కారణంగా అదుపుతప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు, ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమయ్యాయి. కారులోని ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో బోధన్ రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత

బాన్సువాడ: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న బోలెరో వాహనాన్ని శుక్రవా రం సీఐ అశోక్ పట్టుకున్నారు. బీర్కూర్ నుంచి అక్రమంగా వాహనంలో ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమేశ్వర్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

అడుగుకో గుంత.. తీరేనా చింత



భిక్కనూరు-రామేశ్వర్‌పల్లి మధ్య ఉన్న బీటీ రోడ్డు

భిక్కనూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. భిక్కనూరు–రామేశ్వర్‌పల్లి, భిక్కనూరు–అంతంపల్లి, పెద్దమల్లారెడ్డి– ఇసన్నపల్లి, మల్లుపల్లి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ మార్గాల్లో అడుగుతీసి అడుగేస్తే గుంత ప్రత్యక్షమవుతోంది. ఈ గ్రామాలకు వెళ్లే వారు నరకయాతన అనుభవిస్తున్నారు. వాహనాలపైన కాకుండా నడుచుకుంటూ వెళ్లినప్పటికీ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ మార్గాల్లో వాహనాదారులు కింద పడి గాయాలపాలవుతున్నారు. వెంటనే ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రోడ్లను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

నరకం కనిపిస్తోంది



భిక్కనూరు నుంచి తిప్పాపూర్ గ్రామానికి వెళ్లాలంటే రామేశ్వర్‌పల్లి మీదుగా వెళ్లాల్సి వస్తోంది. భిక్కనూరు–రామేశ్వర్‌పల్లి రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. ఈ రోడ్డుపై వెళ్తూ నరకం చూస్తున్నాం. గుంతలతో పాటు బురదమయంగా మారింది. నడుచుకుంటూ వెళ్లినా నరకం తప్పడం లేదు.

– స్వామి, తిప్పాపూర్

రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన అవసరమని సీపీ పోతరాజు సాయిచైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం క్రాష్ ఇన్వెస్టిగేషన్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలపై సమగ్ర దర్యాప్తు చాలా కీలకమని, ప్రతి ప్రమాదం వెనక ఉన్న అసలైన కారణాలను వెలికితీసి, భవిష్యత్‌లో అలాంటి ఘటనలు జరగకుండా చూసేందుకు సహాయపడుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి పోలీస్ సిబ్బంది సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఈథర్ మేనేజర్ వర్షా నిహంత్, సేవ్ లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు సాహెల్ మోటో, నూర్ ఖాట్టర్ పాల్, చిరాగ్ కాటేగర్, సీటీసీ సర్కిల్ సీఐ శివరాం తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో న్యాయవాది మృతి



కిరణ్ కుమార్‌గౌడ్ (ఫైల్)

నిజామాబాద్ లీగల్: నగరానికి చెందిన న్యాయవాది పెద్దగాని కిరణ్ కుమార్ గౌడ్ (57) గుండెపోటుతో మృతి చెందాడు. కిరణ్ శుక్రవారం సాయంత్రం ఆఫీసర్స్ క్లబ్‌కు చేరుకున్న కొద్దిసేపటికి ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ప్రారంభిస్తుండగానే గుండెపోటుతో ప్రాణాలు వదిలాడు. 1997లో న్యాయవాద వృత్తిలో ప్రవేశించిన కిరణ్ కుమార్ గౌడ్, సీనియర్ న్యాయవాది నారాయణరెడ్డి వద్ద జూనియర్‌గా పనిచేశాడు, న్యాయవాదిగా సివిల్, క్రిమినల్ కేసులు వాదించాడు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. గవర్నమెంట్ ప్లీడర్‌గా, న్యాయవాదుల సొసైటీ వ్యవస్థాపక సభ్యుడిగా, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శిగా పనిచేశాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కిరణ్ మృతిపట్ల నిజామాబాద్ బార్ అసోసియేషన్ సోమవారం సంతాప సభ నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిళ్ల సాయిరెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ ..

రుద్రూరు: ఆత్మహత్యకు యత్నించిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రుద్రూర్ ఎస్సై సాయన్న వెల్లడించారు. వివరాలు ఇలా.. మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన గాండ్ల సావిత్రి (62) ఈనెల 11న కడుపునొప్పి బాధ భరించలేక యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కొడుకు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతీయవద్దు

ఖలీల్‌వాడి: పోలీసుల ఆత్మస్థైర్యంను దెబ్బతీయవద్దని, పోలీసులకు అందరు సమానులేనని నిజామాబాద్ పోలీస్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ష కీల్ పాషా అన్నారు. జిల్లాకేంద్రంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు సరైనవి కాదన్నారు. ఆర్మూర్‌లోని యాసీన్ హోటల్ నిబంధనలకు విరుద్ధంగా రాత్రివే ళ కొనసాగడంతో కేసులు నమోదు చేశామన్నారు. పోలీసుల పేర్లు పింక్‌బుక్‌లో రాస్తామని సదరు నా యకుడు చెప్పడం సరైనది కాదన్నారు. పోలీసులు నిబంధనలకు అనుకూలంగా పనిచేస్తారని, ఎవరిపై కక్షపూరితంగా వ్యవహరించరని తెలిపారు. మరోసారి పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ సంఘం ప్రతినిధులు చందూలాల్, సాయిలు, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

26 వరకు ఓపెన్ వర్సిటీలో ప్రవేశాలు

నిజామాబాద్అర్బన్: నగరంలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈనెల 26 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ప్రవేశాలు పొందవచ్చని కో–ఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ ఎంబీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు, ఆసక్తి గలవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.